## అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల ఉక్కు పాదం

### కడప ఎస్పీ ఇ.జి.అశోక్ కుమార్



**కడప పెన్ పవర్ జూన్ 22 :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ గారు హెచ్చరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను జిల్లా ఎస్.పి వివరించారు.

**మట్కా, గ్యాంబ్లింగ్ పై ముమ్మర దాడులు :**

జిల్లాలో గత 15 రోజుల్లో 13 మట్కా కేసుల్లో మొత్తం 43 మంది అరెస్టు చేసి రూ. 2,11,930 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదమాడుతున్న మొత్తం 106 మందిని అరెస్టు చేసి రూ. 1,82,650 నగదు స్వాధీనం చేసుకుని 19 కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్.పి గారు తెలిపారు.

**క్రికెట్ బెట్టింగ్ :**

జిల్లాలో రెండు క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న 8 మందిని అరెస్టు చేసి రూ. 76,000 నగదు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేయడం జరిగింది.

**రెండు కిలోల గంజాయి స్వాధీనం, 5 మంది అరెస్టు :** గంజాయి విక్రయిస్తున్న 5 మందిని అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్.పి తెలిపారు.

**బహిరంగ మద్యపానంపై దాడులు :**

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ముమ్మర దాడులు నిర్వహించి 235 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 52 మందిపై కేసులు నమోదు చేశారు.

**కోడి పందేలపై దాడులు :**

3 కోడి పందేల కేసుల్లో మొత్తం 21 మందిని అరెస్టు చేసి రూ. 81,250 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

**అక్రమ మద్యంపై దాడులు :**

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి 3.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియచేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్.పి శ్రీ ఇ.జి అశోక్ కుమార్ తెలిపారు.

## సచివాలయ ఉద్యోగుల బదిలీలలో స్థానిక నిబంధనను తొలగించాలి




**పలమనేరు జూన్ 22, (పెన్ పవర్) :** గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో, మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అదే మండలంలో పని చేయకుండా చేసిన నిబంధనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఎన్జీజీవో సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షులు ఆనందబాబు,కార్యదర్శి జయమ్మ డిమాండ్ చేశారు. ఈ నిబంధన కారణంగా పలువురు చిరుద్యోగులు,మరీ ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వారు సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ విభాగం ఉద్యోగులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న వేళ ప్రభుత్వం వెంటనే స్పందించి ఈనిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్,రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, సంఘ నాయకులు హైదర్,దాము తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ నూతన కార్యవర్గ సమావేశం



**తిరుపతి/పెన్ పవర్/జూన్ 22 :** తిరుపతి నగరంలోని మన తిరుపతి ప్రెస్ క్లబ్ వేదిక చేసుకుని ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ అనంతపురం జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగినదని వ్యవస్థాపకులు పోన్న రవికుమార్ తెలియజేశారు. ఈ ఆర్టిఐ ఫైట్ ఫోర్ సోషల్ జస్టిస్ కార్యవర్గంలో పనిచేసే ప్రతి కార్యకర్త ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తారని అలాగే ప్రజల్లోని సమస్యలు ప్రభుత్వానికి వివరించడంలో ముందుంటామని ఆ సమస్యల మీద పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని ఆ సమస్య తీరేంతవరకు బాధితులకు అండగా నిలబడతామని తెలియజేశారు. కొత్తగా నియమితులైన అనంతపురం జిల్లా కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జొన్నావుల సురేంద్ర, రాష్ట్ర ఈసీ మెంబర్ కమలాకర్ రాజు కొత్తగా నియమితులైన అనంతపురం జిల్లా అధ్యక్షులు మంజునాథ, శివశంకర్,ఆదినారాయణ, ఓబులేసు, శ్రీనివాసులు, రాజశేఖర్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు ప్రాఫిట్ షూ కంపెని ప్రోత్సాహక పురస్కారాలు



**పలమనేరు జూన్ 22, (పెన్ పవర్) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థిని విద్యార్థులను, అలాగే విద్యార్థులను ప్రోత్సహించిన ప్రధాన ఉపాధ్యాయులను గుర్తించి పట్టణానికి చెందిన ప్రాఫిట్ షూ కంపెనీ ప్రతినిధులు ఆత్మీయంగా సత్కరించి పట్టణ సిఐ నరసింహరాజు చేతుల మీదుగా ప్రోత్సాహ బహుమతులు అందించారు.ఆదివారం పట్టణంలోని ప్రాఫిట్ షో రూమ్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ మరియు అర్బన్ ఎస్ఐ లోకేష్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల నుద్దేశించి సిఐ మాట్లాడుతూ.. ఇష్టంగా కష్టపడి చదివితే జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగడానికి దోహదపడుతుందన్నారు.

అలాగే బాగా చదివి తల్లిదండ్రులకు ,తమ ఊరికి మంచి పేరు తేవాలని కోరారు. ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రాఫిట్ షూ కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు.ప్రతిభ పురస్కారం అందుకున్న పెద్దపంజాణి మండలం శంకర్రాయల్ పేట గురుకుల పాఠశాల విద్యార్థిని శ్రీ మల్లెరెడ్డి గారి సుమశ్రీ ప్రథమ బహుమతి పొందగా, పలమనేరుకు చెందిన రూపేష్ యాదవ్ కు రెండవ బహుమతి ఇవ్వడం జరిగిందని ప్రాఫిట్ షూ కంపెనీ మేనేజర్ సుబ్రహ్మణ్యం అన్నారు.ఇందులో ఏరియా మేనేజర్ మనోహర్,కంపెనీ సిబ్బంది మరియు విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు బాలాజీకి హిందూపురంలో సడ్లపల్లె కథా పురస్కారం



**పలమనేరు జూన్ 22,(పెన్ పవర్) :** స్థానిక కవి,రచయిత పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ తన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి ఆదివారం హిందూపురంలో జరిగిన సభలో తపన సాహిత్య వేదిక నుండి సడ్లపల్లె కథా పురస్కారాన్ని అందుకున్నారు.ప్రముఖ కథా రచయితలు సడ్లపల్లి చిదంబర రెడ్డి,శశికళ, శాంతి నారాయణ,స్వర్ణ కిలారి,ఈశ్వర రెడ్డి, డాక్టర్ ఎం ప్రగతి,చాంద్ భాషా,కైమలి,గండికోట వారిజ, హిందూపురం డిఎస్పి.కె.వి మహేష్, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఎనమదల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఎరుకల జన జీవితాలను,వారి గుండె చప్పుళ్లను, కన్నీళ్లను,ఆత్మగౌరవ పోరాటాలను ఏకలవ్య కాలనీ కథల ద్వారా ప్రపంచానికి కళ్లకు కట్టినట్టుగా రచయిత తెలియ చెప్పారని అందుకే ఈ కథా సంపుటికి బహుజన సాహిత్య పురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం,కెనడా తెలుగుతల్లి పురస్కారం,సడ్లపల్లె కథాపురస్కారం లభించాయని సమీక్షకులు సహ ఆచార్య జి.యమునా రాణి అన్నారు.ఇన్నేళ్ల తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకల కథా సంపుటిగా ఏకలవ్య కాలనీ ఒక మలుపు అని ఆమె అన్నారు.తెలుగు సాహిత్యంలో ఎరుకల జన జీవితాలను చిత్రీకరించిన తొలి రచయిత పలమనేరు బాలాజీ అని వక్తలు ప్రశంసించారు.తన రచనలకు తెలుగు సాహిత్య రంగంలో మూడు దశాబ్దాలకు పైగా చేస్తున్న కృషికిగాను పలమనేరు బాలాజీ రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. కథ,కవిత,నవలా ప్రక్రియలలో స్మైల్ పురస్కారం,కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం,నూతలపాటి గంగాధరం పురస్కారం,మాడభూషి రంగాచార్య స్మారకపురస్కారాలను, హొసూరు ఉగాది పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీత పలమనేరు బాలాజీని పలువురు రచయితలు సాహితీవేత్తలు ప్రశంసించారు.

## సంక్షేమ వసతి గృహాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి







**కడప పెన్ పవర్ జూన్ 22 :** జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీ వార్డెన్స్ అక్రమాస్తులపై సిట్ విచారణ చేపట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక కడప నగరంలోని నెంబర్ 3 హాస్టల్‌ను ఆర్ఎస్ఎఫ్ బృందం పరిశీలించారు. అనంతరం విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డి. యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయన్నారు కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు ఖాళీగా ఉన్న కమాటి, వాచ్మెన్, వంట మాస్టర్, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఓకే వార్డెన్ కు రెండు మూడు హాస్టల్స్ ఇన్చార్జులుగా ఇచ్చి అవినీతి అక్రమాలకు పాల్పడడానికి జిల్లా అధికారులే లైసెన్సులు ఇస్తున్నారని మండిపడ్డారు ఇన్చార్జిల పాలనలో ఒక్క హాస్టల్ నుండే ఇతర హాస్టల్స్ కు భోజనం సప్లై చేయడం ఏమిటంటే వారు ప్రశ్నించారు ఫిల్టర్ వాటర్ ఇవ్వకపోవడం కారణంగా విద్యార్థులు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు బాత్రూంలో శుభ్రం చేయకపోగా కనీసం డోర్లు కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు తక్షణమే జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ వార్డెన్స్ ఆస్తులపై సిట్ విచారణ చేపట్టాలని, ఇన్చార్జి వార్డెన్ కు కొమ్ము కాస్తున్న జిల్లా సంక్షేమ వసతి గృహాల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో పూజలు





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 22 :** చంద్రశేఖరపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానం నందు స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయము స్వామివారి అభిషేక విగ్రహానికి పంచామృత అభిషేకొత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామికి అభిషేకాలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూల విరాట్ మరియు శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరణ చేసి శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు, శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ వేదమంత్రాలతో గోశాలలో గోపూజ కార్యక్రమం తదుపరి మహా నైవేద్యాంతో ఆలయ ఆవరణం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని మహా నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మొక్కులు తీర్చుకునేందుకు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు గోత్రనామాలతో ఆశీర్వదించి స్వామివారి పూజలు అందించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు దేవస్థానంలో భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ముదుమాల నారాయణరెడ్డి, భక్తులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## శారీరక ధృఢత్వం క్రీడలతోనే సాధ్యం

### పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు - ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి




**కావలి పెన్ పవర్ - జూన్ 22 :** శారీరక ధృఢత్వం క్రీడలతోనే సాధ్యమని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలిలోని బృందావనం కళ్యాణ మండపంలో ఆదివారం 'మిస్టర్ సింహపురి స్టీల్ మెన్ బాడీబిల్డింగ్ ఛాంపియన్ షిప్ 2025' రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా స్థానిక శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, డి.ఎస్.పి శ్రీధర్, ఇండియన్ బాడీ బిల్డర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ స్వామి రమేష్ కుమార్, ఆంధ్ర బాడీ బిల్డర్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బాడీ బిల్డింగ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వారు హాజరైయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ఉమెన్ మోడల్ ఫిట్నెస్ ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ సంజన (ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్), అర్జున్ అవార్డు గ్రహీత నేషనల్ భాస్కరన్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 మంది క్రీడాకారులు 10 విభాగాలలో పోటీ పడ్డారు. విజేతలకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ఎంపీ మస్తాన్ రావు లు బహుమతులను అందజేశారు.. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడలపై మక్కువ పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కావలిలో తన మామ ఆశయాలను కొనసాగిస్తూ కావలి ఖ్యాతిని ఇండియా స్థాయిలో పేరు తీసుకువచ్చాలా కృషి చేస్తున్న జగన్ కు ధన్యవాదా లు తెలిపారు.



## కునుకు లేని డ్రైవరే కునుకులోకి....

### అదుపు తప్పిన ఆయిల్ ట్యాంకర్

**(3వ పేజీ తరువాయి)** కృష్ణపట్నం పోర్టు నుంచి శ్రీ కాళహస్తి కి వెళుతుంది. మార్గం మధ్యలోనే ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న డివిజన్ ఎస్పై ఆదిలక్ష్మి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఎలా జరిగిందో సమాచారం తెలుసుకున్నారు. ఏఎస్ఐ మునుస్వామి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన డ్రైవర్ను 1033 ఎన్ హెచ్ ఐ అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం శ్రీ కాళహస్తి ఏరియా హాస్పిటల్ కు తరలించడం జరిగింది . డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు మీద ఎటువంటి ట్రాఫిక్ లేకుండా ఓఎన్ఎమ్ పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ని అదుపు చేశారు.

## సంకల్పం ముందు ఓడిన వైకల్యం

**(3వ పేజీ తరువాయి)** సాయాన్ని కూడా ట్రస్ట్ తరఫున అందజేస్తున్నారు. శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ సవాళ్ల మధ్య సేవా యాత్ర : వృద్ధుల సంరక్షణ కోసం ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. వాటిలో ముఖ్యమైనది స్థిర నివాసం, ఆర్థిక సహాయాల లోపం, సిబ్బంది లేమి, వైద్య సదుపాయాల కొరత వృద్ధుల జీవన నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. రేషన్, ఔషధాలు, హాస్పిటల్ సదుపాయాల కోసం ప్రభుత్వ మద్దతు అవసరమైంది. అయినప్పటికీ, ట్రస్ట్ సభ్యులు తమ సామర్థ్యాన్ని మించి కృషి చేస్తూ, వృద్ధుల సంరక్షణ కోసం నిస్వార్థంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు సమాజం నుండి మరింత సహకారం అవసరం.

**దాతల సహకారం :**

శ్రద్ధావంతులు, సేవాపరుల అంకితభావంతో కొనసాగుతున్న ఈ ఆశ్రమం, దాతల సహకారంతో నడుస్తుందని నిర్వాహకురాలు సైదమ్మ తెలియజేశారు ఎంతోమంది దాతలు మేము చేసే సేవలో తమ వంతు సహాయాన్ని అందించారని, మా సేవలను మరింత మెరుగ్గా అందించటానికి మరి కొంతమంది దాతల నుంచి సహాయహస్తం కోరుతున్నామని నిస్వార్థ సేవకు అడ్డుపడుతున్న సమస్యలపై చైతన్యం కోరుతున్నామని ట్రస్ట్ నిర్వాహకురాలు తెలియజేశారు.

## డ్రైవర్ మత్తులోకి.. కారేమో



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 22 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం ఎన్ హెచ్ 71 నాయుడుపేట టు పూతలపట్టు జాతీయ రహదారిపై వడ్డీ పాలెం సమీప ప్రాంతంలో డ్రైవర్ నిద్ర మత్తులో బార్ గేట్స్ ఢీకొనడం జరిగింది. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవడంతో డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు.డ్రైవర్ త్యాగరాజు తిరుపతి నుంచి విజయవాడ వెళుతున్నట్లు సమాచారం తెలపడం జరిగింది. పెళ్లకూరు ఏఎస్ఐ ముని స్వామి సంఘటనా స్థలానికి చేరుకొని సమాచారం తెలుసుకున్నారు. ఎన్ హెచ్ ఐ ఓ ఎన్ ఎం సిబ్బంది ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని. ట్రాఫిక్ ని అదుపు చేస్తూ సేఫ్టీ కోన్స్ పెట్టడం జరిగింది.

## మంత్రి సత్య కుమార్ యాదవ్‌ని కలిసిన పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా..





**ధర్మవరం పెన్ పవర్ జూన్ 22 :** రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ని ధర్మవరం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుస్తకాలను అందజేసిన పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, అభినందనలు తెలిపిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కుటుంబ సభ్యులు పులివెందుల చైర్మన్ జాన్ పాల్, కడప అన్నమయ్య చైర్మన్ డేవిడ్ కళ్యాణ్ రాజు, కడప వైద్య విభాగం అధ్యక్షురాలు సింధు అప్పల రెడ్డి, కడప జిల్లా మహిళా చైర్మన్ అంకిరెడ్డి మేరీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## వాహనాల తనిఖీ చేసిన ఎస్ఐ



**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 22 :** వాహనాల తనిఖీ చేసిన ఎస్ ఐ పుల్లల చెరువు వైఎస్ఆర్ సెంటర్ కూడలి వద్ద ఎస్ ఐ సంపత్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలను తల్లి, దండ్రులు ఇవ్వవద్దని అన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని అన్నారు.వాహనదారులు, లైసెన్స్, సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.ఆయనవెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## శ్రీ కావమ్మ కథ నాలుగవ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 22 :** పట్టణంలో గాంధీ వీధి, కావమ్మ సందు నందు వెలసి ఉన్న శ్రీకావమ్మ మారయ్య, శ్రీరామ మందిరం నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా జూలై 4, 5 ,6 తేదీలలో నిర్వహించే శ్రీ కావమ్మ మారయ్య కథ కరపత్రాలను ముఖ్య అతిధులు ఆలయ నిర్వాహకులు ఎక్స్ కౌన్సిలర్ నెల్లూరు రవికుమార్, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ వడకలూరు మస్తానయ్య చేతుల మీదుగా శ్రీ కావమ్మ, మారయ్య కథ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరింపజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నెల్లూరు కన్నయ్య,నెల్లూరు జగదీష్, కాట్రపల్లి చంద్రశేఖర్, నెల్లూరు గాంధీ, నెల్లూరు శివ ప్రసాద్, బెట్టెం వెంకటేశ్వర్లు, పనబాకం శరవణ కుమార్, నెల్లూరు సతీష్, కాట్రపల్లి మోహనకృష్ణ,పాడి కమలాకర్, ఆర్ముగం, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కుంభాభిషేక కార్యక్రమంలో బొజ్జల రిషితా రెడ్డి



**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 22 :** మండలం లోని పోలి గ్రామం నందు గ్రామ దేవత కుంభాభిషేకం సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషిత రెడ్డి పాల్గొని, వారు ముందుగా అమ్మవారికి సారె సమర్పించి, అనంతరం అమ్మవారిని దర్శించుకుని, గ్రామ ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగినేని చెంచయ్య, మండల పార్టీ అధ్యక్షులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కాట్రపల్లి గ్రామంలో ఎంజిఎం ఉచిత వైద్య శిబిరం విజయవంతం




**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 22 :** కేవీబీ పురం మండలం కాట్రపల్లి గ్రామంలో ఆదివారం ఎంజిఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో కాట్రపల్లి మరియు చుట్టు ప్రక్క గ్రామాల ప్రజలు దాదాపు 200 మంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఎంజిఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎంజిఎం హాస్పిటల్స్ వారు అవసరమగు పరీక్షలు ఉచితంగానే చేసారు. పరీక్షల అనంతరం అవసరమగు మందులు కూడా ఉచితంగానే అందజేశారు. కాట్రపల్లి గ్రామంలో ఈ వైద్య శిబిరం నిర్వహణ శ్రీకాళహస్తి బీజేపీ అధ్యక్షులు కోలా ఆనంద్ గారి పర్యవేక్షణలో జరిగినది. ఈ కార్యక్రమం లో ఎంజిఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి మరియు చుట్టుపక్క మండలాలకు 24గంటలు డాక్టర్ లు అందుబాటులో ఉంటూ అన్ని అత్యాధునిక సౌకర్యాలతో ఎన్టీఆర్ వైద్య సేవ మరియు అన్ని రకాల ఇన్సూరెన్సు సేవలు అందుబాటులో వున్న హాస్పిటల్ ఎంజిఎం హాస్పిటల్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం డాక్టర్ లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### గద్దర్ అవార్డ్ గ్రహీత


## చరణ్ అర్జున్‌కు ఘన సన్మానం




**పలమనేరు జూన్ 22, (పెన్ పవర్) :** ప్రముఖ రైటర్,సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ ఎంతోమందికి ఇన్స్పిరేషన్ పాటలు అందించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని,ఈ మధ్యనే గద్దర్ అవార్డు తీసుకున్న చరణ్ అర్జున్ ను ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా పలమనేరులో ఉన్న ఆయన అభిమానులు ఆదివారం హైదరాబాద్ కి వెళ్ళి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన ఎంతో ఆప్యాయతతో పలకరించి తనకోసం అంతదూరం నుంచి వచ్చి సన్మానించి నందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ అధ్యక్షులు మాదేశ్ , నేషనల్ కోఆర్డినేటర్ శివ శంకర్,యు డ్రీమ్ మీడియా ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ శివకుమార్, స్టాఫ్ రిపోర్టర్ జయ చంద్ర,పలమనేరు డివిజన్ మీడియా ఆఫీసర్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మన హృదయం, మాటల్లో కాకుండా, భావాల ద్వారా కొన్నిసార్లు మనతో మాట్లాడుతుంది

కృష్ణారెడ్డి సమ్మిరెడ్డి






**కడప పెన్ పవర్ జూన్ 22 :** ఆ హృదయపు స్వరాన్ని మనం వినగలుగుతున్నామా? ఉద్వేగాలు.. సామాజిక మాధ్యమాలలో చురుకుగా ఉండే మనలో చాలామంది, టాటా గ్రూప్ మాజీ ఛైర్మన్ శ్రీ రతన్ టాటాతో ఒక యువకుడు తరచూ తిరుగుతూ ఉండటం చూసి ఉండచ్చు. ఆ యువకుడు ఎవరని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అతను 28 ఏళ్ల శాంతను నాయుడు, రతన్ టాటా కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్నాడు. శాంతను నాయుడు ఒక రచయిత, అతను సామాజిక మాధ్యమాలను కూడా ప్రభావితం చేస్తాడు. వ్యాపార దిగ్గజం ఐన శ్రీ







రతన్ టాటాతో సన్నిహితంగా పనిచేస్తాడు. ఇద్దరి మధ్య అద్భుతమైన స్నేహబంధం కూడా ఉంది. చాలా మందికి ఆసక్తిని కలిగించే విషయం ఏమిటంటే, ఈ యువకుడికి ఇంత చిన్న వయసులో ఆ ఉద్యోగం ఎలా వచ్చిందా అని! తన మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, టాటా ఎలక్సిలో జూనియర్ డిజైన్ ఇంజనీర్ గా చేరడంతో అతని ప్రయాణం ప్రారంభమైంది. ఇతర ఉద్యోగులలాగే అతనూ సాధారణ జీవితాన్ని గడుపుతూండగా, ఒకరోజు జరిగిన సంఘటన అతని జీవితాన్నే మార్చేసింది! జూనియర్ ఇంజనీర్ అవడంవలన, అతను తరచుగా రాత్రి షిఫ్టులలో పని చేసేవాడు, కొన్నిసార్లు తెల్లవారుజామున 1 గంటకు లేదా ఆ తర్వాత కూడా ఇంటికి చేరుకునేవాడు. చాలా సార్లు, రాత్రి ఆలస్యంగా ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు, – వేగంగా వస్తున్న వాహనం కుక్కను ఢీకొట్టడం లేదా కుక్క కారు క్రింద పడి నలిగిపోవడం – ఇలా ఘోరమైనదైనా, భయంకరమైనదైనా ఏదో ఒక ప్రమాదం చూసేవాడు లేదా వినేవాడు. మళ్లీ అలాంటివి చూడకూడదని ప్రతిసారీ ప్రార్థించేవాడు. కానీ సమయం గడిచేకొద్దీ, ప్రతి నెలా ఇలాంటివి జరుగుతూనేఉన్నాయని, ఈ సంఘటనల సంఖ్య పెరగకపోయినా స్థిరంగా మాత్రం ఉంటోందని గ్రహించాడు! ఇక్కడ ఒక నమూనా ఉన్నట్లుగా, ఒక సమస్య ఉన్నట్లుగా గమనించాడు. దాని గురించి ఏదైనా చేయాలని అంతర్గతంగా అతనిలో తపన మొదలయ్యింది. పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, పరిష్కారాన్ని రూపొందించడానికి, ఇలాంటి సంఘటనలను దగ్గర్నుండి అనుభవించిన 80 నుండి 100 మంది డ్రైవర్లతో మాట్లాడాడు. వీరిలో కొందరి వాహనాలు ప్రమాదాలకు గురై కుక్కల మీదకి దూసుకెళ్లిపోతే, మరికొందరు చివరి క్షణంలో కుక్కను కాపాడగలిగారు. వారితో మాట్లాడినప్పుడు, ప్రతి ఒక్కరూ ఒకే పరిస్థితిని ఎత్తి చూపారు, – రాత్రిసమయంలో, చీకట్లో కుక్కలు వారికి కనిపించేవి కావు, అవి వాహనాల వెలుగులో కనిపించే సమయానికి, అవి వాహనానికి దగ్గరగా రావడం వలన డ్రైవర్లకు వాహనాన్ని ఆపడం అసాధ్యం అయిపోయి, పరిస్థితి చేయిదాటిపోయేది. వారిలో కొందరు, కుక్కలు గనుక కొంత దూరం నుండి కనిపిస్తే, వాహన వేగాన్ని తగ్గించడం, ఆపడం లేదా వేరే వైపుకు త్రిప్పడం వంటి వివేకమైన పనులు చేయవచ్చని కూడా సూచించారు. చీకటిలో కూడా కుక్కలు దూరం నుండి కనిపించేలా చేస్తే, డ్రైవర్లు తమ వాహనాలను సకాలంలో ఆపడానికి లేదా వేగాన్ని తగ్గించడానికి వీలవుతుందని తలచి, రెట్రో–రిఫ్లెక్టివ్ పదార్థాలకు సౌలభ్యత ఉన్న డిజైన్ ఇంజనీర్ శాంతను, కుక్కల కోసం ( గ్లో–ఇన్–ది–డార్క్ ) చీకట్లో మెరిసే కాలర్ లను రూపొందించాలని నిర్ణయించుకున్నాడు. ఎలాగైనా కుక్కలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్న అతను, ఆ దిశగా తన ప్రయత్నాన్ని మరింత పెంచడానికి, 'మోటోపావ్స్ అనే సంస్థను కూడా స్థాపించాడు.విద్యార్థి సంస్థ అయినందున, వారు సేకరించిన నిధులు ఈ కాలర్ లను రూపొందించడానికి సరిపోలేదు. అందువల్ల, ఈ కాలర్ లను తయారు చేయడానికి డెనిమ్ వస్త్రాలను ఆధారంగా ఉపయోగించాలన్న ఆలోచన చేశారు. అందుకే, వారు ఇళ్ల నుండి వివిధరకాల పాత డెనిమ్ ప్యాంట్ లను సేకరించి, రిఫ్లెక్టివ్ కాలర్ లను తయారు చేసి, పూణేలో దాదాపు 500 కుక్కలకు ఈ కాలర్ వేశారు! ఈ ప్రయత్నం జరిగిన 48 గంటలలోపే, డ్రైవర్ లు చీకటిలో కుక్కలను చూడటానికి కాలర్ ఎలా సహాయపడిందో, డ్రైవర్లు సరైన సమయంలో తమ వాహనాల వేగాన్ని తగ్గించగలిగినందున ప్రమాదాల నుండి కుక్కలను ఎలా కాపాడగలిగామనే దాని గురించి అనామక ఆన్ లైన్ వ్యాఖ్యలు రావడం ప్రారంభించాయి. ఈ వ్యాఖ్యలు వెంటనే మీడియా దృష్టిని ఆకర్షించాయి. టాటా గ్రూప్ యొక్క వార్తాలేఖలో శ్రీ శాంతను నాయుడు చేసిన పని ప్రముఖంగా పేర్కొనబడింది, దీని ద్వారా ప్రముఖ జంతు కార్యకర్తగా పేరున్న శ్రీ రతన్ టాటా వద్ద నుండి ముంబైకి రమ్మని అతనికి ఆహ్వానం వచ్చింది. ఈ కథను అర్థం చేసుకోవడానికి కీలకం "ఉద్వేగం", అనే పదం. ఉద్వేగం అనేది తమ మార్గాన్ని దాటి ఏదైనా చేయాలనే తపన లేదా తమ పరిధిని మించి చర్య తీసుకోవాలనే బలమైన కోరిక. సరళంగా చెప్పాలంటే, మనం దీనిని "ప్రకృతి తల్లి నుండి వచ్చే ఒక సూచన" అని పిలువవచ్చు. మనలో దాదాపు ప్రతి ఒక్కరికీ ఉద్వేగాలు కలుగుతాయి, కానీ కొంతమంది మాత్రమే వాటిపై చర్య తీసుకుంటారు. అవి మన లక్ష్యాలు లేదా జీవనోపాధిమార్గ నేపథ్యంతో సమం అవవు కాబట్టి ప్రయత్నం చేయడానికి మనం ప్రేరేపించబడం. అందువల్ల, మనం ఆ దిశగా కృషి చేయడం ఆపేస్తాం. కానీ ఈ సంఘటన ఒక వ్యక్తి తన హృదయాన్ని వింటే ఏమి జరుగుతుందో నిర్దుష్టంగా చూపిస్తుంది. మన అంతర్గత స్వరానికి, మన అంతరంగానికి శ్రద్ధ వహించాలని నిర్ణయించుకున్న క్షణంలో మన విధిని మనమే రూపొందించుకోవడం ప్రారంభిస్తాం అని ఇది మనకు గుర్తుచేస్తుంది! అలాగే, మన హృదయస్ఫూర్తితో మనం పని చేసినప్పుడు, మనకు లేదా ఇతరులకు ఎదురయ్యే సమస్యలు, అసౌకర్యాలు సమాజంలో సమూలమైన మార్పును తీసుకురావడానికి సంభవనీయమైన ఆలోచనలుగా మారతాయి – ఇది ఇతరులను ఉద్ధరించడమే కాకుండా మన స్వంత ఎదుగుదలకు కూడా దోహదపడుతుంది. అతిపెద్ద సమస్యలు ఉత్తమమైన ఆలోచనలను కలుగజేస్తాయి! మనం ఎంత బాగా వింటే, హృదయం అంత బిగ్గరగా మాట్లాడుతుంది. మనం ఎంత ఎక్కువగా వింటే, అది మనల్ని మరింత సరైన దిశలో నడిపిస్తుంది.

**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

## కోడి పందాల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 22 :** కొనకనమిట్ల మండలం లోని వాగుమడుగు గ్రామంలో నిషేధితంగా కొనసాగుతున్న కోడి పందాల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు.గ్రామ శివారులో గుట్టుగా నిర్వహిస్తున్న ఈ పందాలలో 9 మంది పాల్గొంటుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఎస్.ఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.35870 నగదు అలాగే 6 ద్విచక్ర వాహనాలు,2 పందెం కోళ్ళు,8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలియచేసారు.

పందాల నిర్వహనతో పాటు జూదంలో పాల్గొన్న 9 మందిని అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..నిషేధితమైన కోడి పందాల నిర్వహణను సహించబోమని, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాలలో శాంతి భద్రతలకి భంగం కలిగించే ఈ రకమైన ఆటలను పూర్తిగా అణచివేసేందుకు పోలీసు విభాగం సిద్ధంగా ఉందన్నారు.ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ కృషి అభినందనీయం



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 22 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా కృషి అభినంద నీయమని చంద్రశేఖరపురం మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రణాళికను రూపొందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుపరిచే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2024–2025 సమగ్ర అభివృద్ధి నివేదిక ప్రకారం ఏడాదిలో దాదాపు 1,312 కిలోమీటర్ల తారు రోడ్లు, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఉపాధి హామీ పథకం లో మెటీరియల్ నిధులతో సిమెంట్ రోడ్లు, వ్యవసాయ నీటి కుంటలు, గోకులాలు, పశువుల నీటి తొట్టెలు, కూలీలకు ఉపాధి హామీ పనులు, వ్యవసాయం విద్య వైద్యం ఉపాధి రంగాల్లో మార్పులు కోసం స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించడమే కాకుండా అమలుపరుస్తున్నారని తెలిపారు.

ప్రతి పల్లెలో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని తెలిపారు యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అభిమానులు కృషి చేయాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు


## 23వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 22 :** ఈనెల 23వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

## కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ కు తరలించాలి




**వేంపల్లి పెన్ పవర్, జూన్22 :** జూన్ 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం జరగబోతు ఉంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు అంశాల మీద దృష్టి కేంద్రీకరించాలి. 1). కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదారాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ కు తరలించాలి. విభజన చట్టంలో సెక్షన్ 85, సబ్ సెక్షన్ 1 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల లోపల కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలి. కానీ 11 సంవత్సరాలైనా తెలంగాణ రాష్ట్రంలోని హైద్రాబాద్ లో ఉండడం శోచనీయం. ఈ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లో శ్రీశైలం లో గానీ, కర్నూలులో ఏర్పాటు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డు పై 27వ తేదీ సమావేశంలో ఒత్తిడి చేయాలి. 2). బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా, కేంద్ర జలసంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఎగువనా ఉన్న తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా శ్రీశైలం రిజర్వాయర్ నుండి 90 టీఎంసీ లు ఎత్తిపోసే విధంగా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ను, 30 టిఎంసి లు ఎత్తి పోసే విధంగా డిండి ప్రాజెక్టు ను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే దిగువ నా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్, వెలిగొండ, హంద్రనీవా, తెలుగుగంగ, గాలేరునగరి, ఎస్సర్బిసీ ప్రాజెక్టులకు నీరు అందక 48 లక్షల ఎకరాల సాగు భూమి, బీడు భూమి గా మారుతుంది. తాగునీటికి కటకట ఏర్పడుతుంది. పరిశ్రమలకు నీరు అందదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదశ్ తార్ ఎడారి అవుతుంది. కాబట్టీ 27వ తేదీ జరగబోయే సమావేశంలో తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్ధవంతంగా కృషి చేయాలి.

## పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి సభా వేదికను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 22 :** జూన్ 23 సోమవారం నాడు జరుగు జిల్లా స్థాయి సమీక్ష సమావేశమునకు ముఖ్యఅతిథిగా వైఎస్ షర్మిల రెడ్డి విచ్చేయనున్న సభ వేదికను పరిశీలించి పలు సూచనలు చేసిన డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, పిసిసి ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి రత్నం,వీర మోహన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫయాజ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కాట్రపల్లి గ్రామంలో యంజియమ్ ఉచిత వైద్య శిబిరం

**శ్రీ కాళహస్తి – పెన్ పవర్, జూన్ 22 :** కేవీబీ పురం మండలం కాట్రపల్లి గ్రామంలో ఆదివారం యంజియమ్ హాస్పిటల్స్ మరియు భాజపా రాష్ట్ర మీడియా కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కాట్రపల్లి మరియు చుట్టు ప్రక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి యంజియమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి యంజియమ్ హాస్పిటల్స్ వారు అవసరమైన పరీక్షలు ఉచితంగానే చేసారు. పరీక్షల అనంతరం మందులు కూడా ఉచితంగానే అందజేశారు. కాట్రపల్లి గ్రామంలో ఈ కార్యక్రమంలో యంజియమ్ హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి మరియు చుట్టుపక్క మండలాలకు 24 గంటలు డాక్టర్ లు అందుబాటులో ఉంటూ అన్ని అత్యాధునిక సౌకర్యాలతో ఎన్టీఆర్ వైద్య సేవ మరియు అన్ని రకాల ఇన్సూరెన్సు సేవలు అందుబాటులో వున్న హాస్పిటల్ యంజియమ్ హాస్పిటల్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంజియమ్ డాక్టర్ లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.